క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గెలుపు.. అభివృద్ధికి మలుపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమానికి చోటు ఉంటుందని 30వ డివిజన్ కార్పొరేటర్ బి.హెచ్.ఎస్.వి.జానారెడ్డి అన్నారు. ఫ్యాన్ గుర్తుపై నిండు మనస్సుతో ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. స్థానిక 30వ డివిజన్ దేవీ నగర్‌లో గురువారం వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి జానారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి, ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. విలువలు విశ్వసనీయతకు మారుపేరుగా పారదర్శక పాలన సాగించిన జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గారావు, నారాయణరెడ్డి, రామకృష్ణ, పెద్దబాబు, మణికంఠ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేటితరం విద్యార్థుల్లో సమాజంపై అవగాహన పెరగాలని రోటరీ క్లబ్-3020 గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు సూచించారు. గాంధీనగర్‌లోని చిట్టూరి పబ్లిక్ స్కూల్ సమావేశ మందిరంలో ఆయన గురువారం విద్యార్థులతో సమావేశమై ప్రసంగించారు. రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమైన పోలియో నిర్మూలన అంశంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాయన బాబ్జి మాట్లాడుతూ.. క్లబ్ నిరంతర కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల కోసం దంత, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సెక్రటరీ ఎం. మోహన్ రావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో పేదలకు సరుకులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చిట్టూరి ఆనంద రామ సుధాకర్, అమానుల్లా, పోతిన సురేష్, సుబ్బరాజు, జి.వి.రావు, జె.కె. సుబ్బారావు, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

అలరించిన మ్యాజిక్ షో



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం టీవీ మిమిక్రీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ చేసిన మిమిక్రీ భక్తులను అలరించింది. శ్రీనివాస్ చేసిన మ్యాజిక్, ఇంద్రజాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా పెద్ద సంఖ్యలో భక్తులు, కళాభిమానులు మిమిక్రీ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం మిమిక్రీ శ్రీనివాస్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యాన సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీర్రాజు, గంగిశెట్టి సాంబశివ రావు పర్యవేక్షించారు.

అపురూపం.. శ్రీరామ పట్టాభిషేకం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలు, శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన యల్లాజ్యోసుల అనురాధ బృందం ప్రదర్శించిన శ్రీరామ పట్టాభిషేక నృత్యరూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్యరూపకంలో అయోధ్యలో పుత్రకామేష్టి యాగం, రామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నల జననం, యాగ రక్షణ, సీతా స్వయంవరం, అరణ్యవాసం, రామ రావణయుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం వంటి అంశాలను చక్కటి నృత్య రూపకంలో ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు ఆలయ కార్యనిర్వహణాధికారి రామరావు సత్కరించి అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు.

కాలనీల్లో అభివృద్ధి పరుగులు

- 24వ డివిజన్‌లో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.8 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం
- రూ.7 కోట్లతో మోడల్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్న డివిజన్ ప్రజలు



అధునాతనంగా రూపుదిద్దుకున్న కడియాలవారి వీధి



గద్దే బాబూరావు వీధి నాడు-నేడు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, స్థానిక నాయకత్వం చొరవతో 24వ డివిజన్‌లో అభివృద్ధి పరుగులు పెట్టింది. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచని తమ ప్రాంతాలు ఎంతో పురోగతి సాధించాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల్లో మురుగు కూపాలుగా ఉన్న రోడ్లు సీసీ, బీటీ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ ఆధునికత సంతరించుకుంది. ఒకప్పుడు ఎక్కడ చూసిన మ్యాన్‌హోల్స్ పొంగుతూ కనిపించే రోడ్లు, ఇప్పుడు తళతళా మెరుస్తున్నాయి. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే అభివృద్ధి ఎలా జరుగుతుందో కళ్లకు కనిపిస్తోంది.

అందుబాటులో మోడల్ సబ్‌స్టేషన్

గిరిపురం, న్యూ గిరిపురంలో పేదలు నివసిస్తారు. విద్యుత్ సరఫరాలో తరుచూ హెచ్చుతగ్గులు వస్తుండటంతో స్థానికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ ఉపకరణాలు దెబ్బతినేవి. ఈ సమస్యను ప్రభుత్వం ఆ ప్రాంతంలో పాటు, చుట్టుపక్కల కాలనీల్లో మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో వాటర్ ట్యాంక్ రోడ్డు వైపు రూ.7 కోట్లతో అత్యాధునిక సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అత్యాధునిక కంట్రోలింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయగా, ట్రాన్స్‌ఫారంను సిద్ధంచేశారు. త్వరలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రజలు అందుబాటులోకి రానుంది.



ఐజీఎంసీ స్టేడియంలో అధునాతన సబ్‌స్టేషన్

మౌలిక సదుపాయాల కల్పన

సీతారామపురం కడియాల వారి వీధిలో సన్‌రైజ్ హాస్పిటల్ పక్కన గతంలో మ్యాన్‌హోల్స్ నుంచి ఎప్పుడూ మురుగు పొంగుతూ ఉండేది. మురుగునీరు రోడ్డుపై నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పేవి కాదు. ప్రస్తుతం ఆ రోడ్డులో కొత్తగా యూజీడీ పైప్‌లైన్ వేయడంతో పాటు, రోడ్డును నిర్మించారు. గద్దే బాబారావు వీధి, కస్తూరిబాయిపేట ఆర్సీఎం చర్చిరోడ్డు, కాజా మునలయ్యవీధి, చలమలవారి వీధి సీసీ, బీటీ రోడ్లుగా అభివృద్ధి చెందాయి. గిరిపురంలోని తరిమెల నాగిరెడ్డి వీధి, బొబ్బూరి పురుషోత్తం వీధి, ఏసోబు వీధి, చిలకాప్రసాద్ వీధి, ఢిల్లీ కోటమ్మ వీధి, ఇందుపల్లి జయరాజు వీధిలో యూజీడీ పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసిన నిధులతో పాటు, నగర పాలక సంస్థ నిధులతో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. డివిజన్‌లో ఇప్పటి వరకూ రోడ్లు, సైడు డ్రెయిన్‌లు, యూజీడీకి సంబంధించి 50కి పైగా పనులు చేపట్టారు.

అభివృద్ధి చేసి చూపించాం



గతంలో ఈ డివిజన్‌లో ఏ రోడ్డుకు వెళ్లినా మ్యాన్ హోల్స్ పొంగుతూ కనిపించేవి. రోడ్లపై మురుగు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను నగర పాలక సంస్థ అధికారులతో పాటు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాం. కొత్తగా యూజీడీ లైన్స్ వేయడంతో పాటు, సీసీ, బీటీ రోడ్లు నిర్మించాం. డివిజన్‌లో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశాం. ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

– కుక్కల అనిత, కార్పొరేటర్, 24 డివిజన్

సమస్యలు పరిష్కారం



మా డివిజన్‌లో గతంలో అనేక సమస్యలు ఉండేవి. కస్తూరిబాయిపేట, సీతారామపురంలో రోడ్లపైకి మురుగు చేరేది. ఎవరూ పట్టించుకునే వారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్పొరేటర్ కుక్కల అనిత, ఎమ్మెల్యే మల్లాది విష్ణు చొరవతో సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా బీటీ, సీసీ రోడ్లు కనిపిస్తున్నాయి. మంచి చేసిన ప్రభుత్వానికే మా మద్దతు ఉంటుంది.

– మరియరాణి, కస్తూరిబాయిపేట

ఘనంగా ముగిసిన వసంతనవరాత్రి ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన గురువారం వసంతనవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అమ్మవారికి చీరలతో అర్చనలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

కేబీఎన్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల సౌకర్యార్థం కేబీఎన్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.నారాయణరావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మున్ముందు ఏ కోర్సులు తీసుకుంటే మంచిది, ఏ విధమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి, డిగ్రీ కోర్సులకు ఎలా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చనే అంశాలను అధ్యాపకులు కౌన్సెలింగ్ సెంటర్‌కు వచ్చే విద్యార్థులకు వివరిస్తారని పేర్కొన్నారు.

జగనన్న పాలనలో ప్రజలందరికీ సంక్షేమం



63వ డివిజన్‌లో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరించి ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాయని, అందువల్లే ఎన్నికల ప్రచారానికి వచ్చిన తనకు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)కు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 63వ డివిజన్ 276 సచివాలయ పరిధి రాధానగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనేక మంది మహిళలు వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానీలకు గుమ్మడి కాయలతో దిష్టితీసి హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం వెలంపల్లి.. మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 63వ డివిజన్ అభివృద్ధి చెందిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. ఆలయాలను కూల్చిన దుర్మార్గుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఆలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఆలయాల్లోకి బూట్లు వేసుకొని, రామోజీరావు దగ్గరకు బూట్లు తీసివేసి వెళ్లే చంద్రబాబు దేవుడి గురించి, ఆలయాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు. ఇంద్రకీలాద్రిపై దుర్గగుడికి రూ.70 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తోంది తమ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. చంద్రబాబు ఒక్క రూపాయికి కూడా ఇంద్రకీలాద్రి అభివృద్ధికి ఖర్చు చేయలేదని గుర్తుచేశారు.

చంద్రబాబువి దుర్మార్గపు రాజకీయాలు

శ్రీరామనవమి రోజు దుర్మార్గపు రాజకీయాలు చేసింది చంద్రబాబు అని వెలంపల్లి విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం బస్సు యాత్ర సక్సెస్ అయిందని బొండా ఉమా ఓర్వలేకపోతున్నాడని పేర్కొన్నారు.

వైఎస్ జగన్‌కు విశేష ప్రజా స్పందన

ఎంపీ అభ్యర్థి కేశినేని నాని మాట్లాడుతూ.. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజాస్పందన బ్రహ్మాండంగా లభించిందన్నారు. ఆ రోజు సీఎం, వెలంపల్లి శ్రీనివాసరావుపై జరిగిన రాయి దాడిలో బొండా ఉమా, అతని ఇద్దరి కొడుకుల ప్రమేయం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి ఏసు, పార్టీ నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్యం కృష్ణ, మాజీ కార్పొరేటర్ వీర్ల వరలక్ష్మి, రాజేశ్వరి, శ్రీనివాస రావు, నాగు పాల్గొన్నారు.

మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



ప్రభుత్వ పథకాల గురించి వివరించి ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, వెలంపల్లి రామకృష్ణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్‌లోని నిరుపేద ప్రజల చిరకాల కోరిక అయిన ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిజం చేసి చూపిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో పేదల జీవితాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు రామకృష్ణతో కలిసి ఆయన 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరి పేటలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి సీఎం జగనన్న చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. రానున్న కాలంలో మరిన్ని మంచి పథకాలు అందాలన్నా, మన బిడ్డలకు చక్కని భవిష్యత్తు లభించాలన్నా సీఎం జగనన్న పాలనను మళ్లీ మీరంతా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థిగా కేశినేని నానిని ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సమగ్ర అభివృద్ధి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి రాఘవ

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. పార్టీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును బలపరుస్తూ 32వ డివిజన్ అయోధ్యనగర్, రామలింగేశ్వరపేట తదితర ప్రాంతాల్లో వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు రాఘవ, కోఆప్షన్ సభ్యురాలు గుండే సుబాషిణిలతో కలిసి మల్లాది విష్ణు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజలందరి ప్రేమాభిమానాలతో ఐదేళ్లలో సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనించిందని, ఏకంగా రూ.866.84 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఈ అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై సంక్షేమ పథకాలు అందేవని గుర్తుచేశారు. నేడు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమదన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1,44,012 మందికి అక్షరాల రూ.1,063.60 కోట్ల సంక్షేమాన్ని అందించామని వివరించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, దగ్గుబాటి పురందేశ్వరికి విశ్వసనీయత లేదని మల్లాది విష్ణు విమర్శించారు. తెలుగుదేశం పేరు చెబితే జరిగిన మంచి ఒక్కటీ గుర్తుకు రాదన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు, పచ్చ మీడియా విష ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుండే సుందర్ పాల్, ఒగ్గు గవాస్కర్, గొల్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే డివిజన్ అభివృద్ధి సాధ్యం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మంచి చేసే ప్రభుత్వానికే ప్రజల మద్దతు ఉంటుందని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం సత్యనారాయణపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శర్వాణీమూర్తి ప్రతి ఇంటికీ వెళ్లి గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించి.. రానున్న రోజుల్లో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలంటే వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా సత్యనారాయణపురంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీ పంపింగ్ స్టేషన్, పార్కులు, నాడు-నేడుతో పాఠశాలలు అభివృద్ధి చెందటంతో పాటుగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం, ఈబీసీ నేస్తం వంటి సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగనన్నని ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కంబంపాటి ప్రసాద్, తల్లప్రగడ గోపాలకృష్ణ, ఉమాదేవి, రాజ్యలక్ష్మి, నాగభూషణం, మూర్తి, రవిశంకర్, ఓగిరాల రాజశేఖర్, సారిక లక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

పాయకాపురం(విజయవారూరల్): వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం 62వ డివిజన్లో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్‌బీఎస్ నగర్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లను ప్రజలకు అందించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా వెలంపల్లి శ్రీనివాసరావును, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నందెపు జగదీష్, షేక్ మస్తాన్, బోర బుజ్జి, రామిరెడ్డి, శ్రీనివాసరావు, మస్తాన్, వెంకట్, హైమావతి, రాధ పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ కోఆర్డినేటర్ బాబు, పార్టీ నాయకులు మాలకొండయ్య, రఫీ పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



పూజలు నిర్వహిస్తున్న డీసీపీ హరికృష్ణ



మహిళల కోలాట నృత్యం



నేత్రపర్వంగా సాగుతున్న రథోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో సీత, లక్ష్మణ, ఆంజనేయ సమేతుడైన కల్యాణరాముని రథోత్సవం గురువారం సాయంత్రం కనులపండువగా జరిగింది. కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీనగరాల సీతారామ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, విచిత్ర వేషధారణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామి వారి రథోత్సవం ఘనంగా ముందుకు సాగింది. తొలుత డీసీపీ హరికృష్ణ కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. కమిటీ ప్రముఖులు అతిథులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి రథానికి వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో నయనానందంగా అలంకరణ చేశారు. అనంతరం సీతా, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో రథంపై అధిష్ఠింపజేశారు. రథోత్సవానికి తొలుత పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వారు పోసి, కుంభం సమర్పించి రథాన్ని ముందుకు లాగారు. బ్రాహ్మణవీధి ఆలయం నుంచి ప్రారంభమై నెహ్రూబొమ్మ సెంటర్, కేటీరోడ్డు, కోమలవిలాస్ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రథోత్సవం సందర్భంగా స్థానిక ప్రజానీకం దారి పొడవునా హారతులిస్తూ స్వాగతం పలికారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌శాఖ, పోలీస్ శాఖలు ప్రత్యేక బందోబస్తు చేపట్టాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఈ రథోత్సవంలో పాల్గొన్నారు.